సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 7 । జూలై । 2023



ఎరువుల కొరత రానీయొద్దు

పెద్దపల్లిరూరల్: రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ సంగీత అధికారులకు సూచించారు. అప్పన్నపేట సహకార సంఘం గోదాంను సందర్శించారు.



పత్తి క్వింటాల్‌కు రూ.6,539

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు గురువారం రూ.6,539 పలికింది. కనిష్టంగా రూ.6,218, సరాసరి రూ.6,488 పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఎఫ్‌సీఐకి సీఎమ్మార్ అందించాలి



పరిశీలిస్తున్న కలెక్టర్ సంగీత

సుల్తానాబాద్‌రూరల్: మిల్లులకు కేటాయించిన ధన్యాన్ని మిల్లింగ్ పూర్తి చేసి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి త్వరగతిన అందించాలని కలెక్టర్ సంగీత మిల్లర్లను ఆదేశించారు. సుల్తానాబాద్ మండలం సుద్దాల పరిధిలోని గౌరీనాథ్, కాట్నపల్లిలోని కనకదుర్గ మిల్లులను గురువారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి తనిఖీ చేశారు. 2022 ఖరీఫ్‌కు సంబంధించి రైస్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఎప్పటికప్పుడు ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యం సరఫరా చేసిన బియ్యం, రైస్‌మిల్‌లో అందుబాటులో ఉన్న ధాన్యం తదితర వివరాల రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్లు అబూబకర్, ధీరజ్ తదితరులున్నారు.

వర్షాలు కురవాలని పూజలు



పూజలు చేస్తున్న రైతులు

జూలపల్లి: వర్షాలు కురవాలని జూలపల్లి సర్పంచ్ నర్సింహాయాదవ్ ఆధ్వర్యంలో రైతులు వాయుదేవుడు, సూర్యచంద్రులకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య శోభాయాత్రగా వెళ్లి స్థానిక కొచ్చెరువు సమీపంలోని సూర్య చంద్రుల విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. స్వామిమొక్కు గొర్రె పిల్లను వదిలి పెట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఏడు వర్షాలు కురవక రైతులు విత్తనాలు వేయలేకపోయారని, రైతుల కోరిక మేరకు మొక్కులు చెల్లించామని వివరించారు. ఉప సర్పంచ్ కొప్పుల మహేశ్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నాడెం మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లోక రవీందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

గర్రెపల్లిని మండలంగా ప్రకటించాలని దీక్ష



సంఘీభావం తెలుపుతున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లి గ్రామాన్ని చుట్టూ ఉన్న తొమ్మిది గ్రామాలతో కలిపి మండలంగా ప్రకటించాలని గురువారం బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి దీక్షకు సంఘీభావం తెలిపారు. విజయరమణారావు మాట్లాడుతూ గర్రెపల్లిని మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీక్షలో మాజీ ఎంపీటీసీలు వెంకటమ్మ, వెంకటేశం, జాని, వెంకన్న పటేల్, కొంరయ్య, రాజయ్య, చక్రధర్ తదితరులు కూర్చున్నారు.

12న ఫిజియోథెరపిస్టు పోస్టుకు ఇంటర్వ్యూలు

పెద్దపల్లిరూరల్: ఫిజియోథెరపిస్టు పోస్టుకు ఈనెల 12న ఇంటర్వ్యూ ఉంటుందని డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్‌సీడీ ప్రోగ్రాం క్రింద పాలియేటివ్ కేర్‌లో ఖాళీగా ఉన్న పోస్టును కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తామని, ఆసక్తి, అర్హత ఉన్న వారు ఒకటి నుంచి 7వ తరగతి స్టడీ సర్టిఫికెట్ల (ఒరిజినల్, జిరాక్స్) ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

12న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటురంగంలో ఉద్యోగాల కల్పనకు ఈనెల 12న ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి వై.తిరుపతిరావు తెలిపారు. భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కంపెనీ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్, బ్రాంచ్ క్రెడిట్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్ పోస్టులకు జాబ్‌మేళా ఉంటుందని, 18 నుంచి 30ఏళ్లలోపు ఉండి.. ఇంటర్, డిగ్రీ చదివిన వారు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పని చేయాల్సి ఉంటుందని, వివరాలకు 89853 36947, 95026 42441 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

ఈ చిత్రంలో కనిపిస్తున్నది మంథని సామాజిక వైద్యశాల. గురువారం ఆస్పత్రిని 'సాక్షి' విజిట్ చేయగా ఉదయం పది గంటల వరకే 70 మంది వరకు రోగులు ఆస్పత్రికి వచ్చారు. విధుల్లో మాత్రం వైద్యురాలు సమత మాత్రమే ఉన్నారు. మరో వైద్యుడు రాజస్వామి పోస్టుమార్టం నిమిత్తం వెళ్లినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఆస్పత్రిలో 19 మంది వైద్యులకు 13 మంది విధులు నిర్వర్తిస్తుండగా.. ఓపీలో మాత్రం రోజుకు ఒక్కరే ఉంటున్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్, డెంటర్ వైద్యురాలు రెగ్యులర్ కాగా మిగిలిన ఆరుగురు కాంట్రాక్ట్, మరో ఆరుగురు గోదావరిఖని నుంచి డెప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆరు డెప్యూటీ సివిల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 13 మంది వైద్యులకు ఒక్కరిద్దరే డ్యూటీలో ఉంటూ మిగతావారు వంతులవారీగా విధులకు హాజరవుతున్నారు. రోజుకు 200కు పైగా రోగులు ఆస్పత్రికి వస్తున్నట్లు ఓపీ రికార్డుల్లో నమోదవుతున్నా.. వైద్యుల కొరతతో నాణ్యమైన సేవలు అందటం లేదు. అలాగే 500 ఎంఎల్ఎన్, డీ-3 మందులు ఆస్పత్రిలో అందుబాటులో లేవని రోగులు వాపోతున్నారు.



విధుల్లో ఉన్న వైద్యురాలు





జిల్లాకేంద్ర ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రోగులు, వీల్‌చేర్ లేకపోవడంతో తల్లిని చేతులతో మోసుకొస్తున్న కొడుకు

వైద్యం అంతంతే..!

డాక్టర్ల కోసం రోగుల పడిగాపులు

- మారిన వాతావరణంతో పెరుగుతున్న ఓపీ
- సమయపాలన పాటించని వైద్యులు
- సరిపడా వసతులు లేక ఇక్కట్లు

సాక్షి, పెద్దపల్లి: వానాకాలం అంటేనే వ్యాధులు మోసుకొచ్చే సమయం. సీజనల్ వ్యాధులతోపాటు ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, డయారియా ప్రబలే అవకాశాలు ఎక్కువ. ఈ క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీచేయడంలో తాత్సారం.. ఆసుపత్రుల్లో వైద్యం అందించే వైద్యులు, సిబ్బంది లేక రోగులు అవస్థలు పడుతున్నారు. వైద్యులు సమయపాలన పాటించకపోవటంతో గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని 14 మండలాల్లో రూరల్‌లో 18 పీహెచ్‌సీలు, అర్బన్‌లో 6 పీహెచ్‌సీలు, వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రులు 4, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 6 ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల నియామకం చేపట్టినా వారు స్థానికంగా అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బంది తప్పటం లేదు. ఉన్న సిబ్బంది నామమాత్రంగా వైద్యం చేసి పంపుతున్నారు. దీంతో రోగం నయం కాక రోగులు మెరుగైన వైద్యానికి సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

పని గంటలపై పట్టింపేదీ..?

జిల్లాలోని ఏరియా ఆసుపత్రితోపాటు, పీహెచ్‌సీలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య సేవలు అందించాలి. కానీ ఉదయం 9 గంటలకు రావాల్సిన డాక్టర్లు 10.30 గంటలకు వస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలస్యంగా వచ్చినా పూర్తి సమయం కూడా ఉండటం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలోని వైద్యులు కూడా సమయపాలన పాటించటం లేదు. డాక్టర్లు ప్రభుత్వ దవాఖానాలో కంటే తమ సొంత క్లినిక్‌లలోనే గడుపుతున్నారు. వీరు ఓ గంట పాటు కుర్చీలో కూర్చుని ఇంటి దారిపడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

వర్షాలతో మారుతున్న వాతావరణ పరిస్థితులతో జ్వర బాధితులు పెరుగుతున్నారు. వర్షాకాలం కావడం.. కలుషిత నీరు, ఆహారం తీసుకుంటుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గురువారం జిల్లాకేంద్ర ప్రధాన ఆసుపత్రికి 372 ఓపీ, గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి 525, మంథని ఏరియా ఆసుపత్రికి 72 మంది ఓపీ వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరిలో కొంతమంది ఆసుపత్రిలో చేరుతుండగా.. మరికొందరు చికిత్స తీసుకుని వెళ్లిపోతున్నారు. ఇంట్లో ఒకరికి వచ్చిందంటే ఇతర కుటుంబసభ్యులకూ వ్యాపిస్తోంది. పెద్దల విషయం పక్కనపెడితే చిన్నపిల్లలోనూ బాధితులు పెరుగుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో కూడా వైద్యులు సమయపాలన పాటించకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సరిపడా మందులున్నాయి



జిల్లా ఆస్పత్రిల్లో అవసరమైనంత మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. వైద్య సేవలు పొందినవారికి అవసరమైన లాబోరేటరీ పరీక్షలు చేయడంతో పాటు మందులను కూడా అందుబాటులో ఉన్నాయి. బయోమెట్రిక్‌తో వైద్యుల సమయపాలనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– శ్రీధర్, డీసీహెచ్‌వో

సీజనల్‌పై అప్రమత్తంగా ఉండాలి



వ్యాధులు రాకుండా వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలి. డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. అలసట, జ్వరం లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ అజయ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్ గోదావరిఖని

నాలుగు రోజుల క్రితం వచ్చా



నేను.. నా కూతురు జ్వరంతో బాధపడుతూ నాలుగు రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాం. నాలుగు రోజులుగా ఇక్కడే సేవలు పొందుతున్నం. ఇంజక్షన్లు, మందులు ఇవ్వడంతో జ్వరం తగ్గింది. నాతోపాటు చాలా మంది జ్వరాలతో ఆసుపత్రులకు వస్తున్నారు.

– సుల్తానా, సుభాష్‌నగర్

అన్ని పరీక్షలూ చేశారు



అనారోగ్యంగా ఉన్నానని పెద్దపల్లి ఆసుపత్రికి వెళ్తే జ్వరం ఉందన్నారు. జిల్లా ఆసుపత్రికి ఐదు రోజుల క్రితం వచ్చా. ఇక్కడ అన్నిరకాల పరీక్షలూ చేశారు. అందుకు తగ్గట్టు మందులు ఇస్తున్నారు. వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటే ఇంకా బాగుంటుంది.

– నఫీసాబేగం, బసంత్‌నగర్

పాపకు జ్వరం, కడుపునొప్పి



మా పాప లొక్య జ్వరం, కడుపునొప్పితో బాధపడుతోంది. స్కూల్‌కు వెళ్లడం లేదు. డాక్టర్‌కు చూపిస్తే మందులు వాడమని రాశారు. తగ్గకపోతే మళ్లీ ఆస్పత్రికి తీసుకురావాలన్నారు. వర్షాలతోనే మా పాప ఇలా అయ్యింది. ఆస్పత్రికి జ్వరాలు, జలుబు సమస్యతో ఎక్కువ మంది వస్తున్నారు.

– రామ్మోహన్, గోదావరిఖని

ఐదు శాతం సీట్ల రిజర్వేషన్‌తో ఉద్యోగుల పిల్లలకు మేలు



రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం

- ఏడు సీట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఐదు శాతం సీట్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. కాలేజీ నిర్మాణానికి సింగరేణి సంస్థ రూ.500 కోట్లు కేటాయించిన నేపథ్యంలో సంస్థ ఉద్యోగుల పిల్లలకు సీట్ల రిజర్వేషన్ కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తమవుతోంది. వైద్య కళాశాలలో మొత్తం 150 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 23 సీట్లు ఆల్ ఇండియా కోటా కింద కేటాయిస్తారు. మిగిలిన 127 సీట్లలో ఐదు శాతం సింగరేణి ఉద్యోగుల పిల్లలకు (ఏడు సీట్లు) కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు సంస్థ సీఎండీ, ఇతర ఉన్నతాధికారి నుంచి ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. నీట్‌లో మెరిట్ ప్రకారం వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్ల భర్తీ విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుంటారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఐదుశాతం సీట్లు కేటాయించడంపై రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హర్షం వ్యక్తం చేశారు.

స్వయం ఉపాధికి యువతకు రుణాలు



మాట్లాడుతున్న కుమార్‌దీపక్

పెద్దపల్లిరూరల్: యువతకు స్వయం ఉపాధి కల్పించేలా ప్రభుత్వం వివిధ పథకాల కింద రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటోందని, బ్యాంకర్లు సహకరించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం డీసీసీ, డీఎల్‌ఆర్సీ సమావేశంలో రుణాల పంపిణీ, తదితర అంశాలపై సమీక్షించారు. స్టార్టప్ ఇండియా కింద ఇప్పటివరకు 84యూనిట్లకు రూ.1,649కోట్ల రుణాలు మంజూరు చేసి 470 మందికి ఉపాధి కల్పించామన్నారు. ముద్ర రుణాల కింద జూన్ చివరి నాటికి 2,927మంది లబ్ధిదారులకు రూ.18.38కోట్లు అందించామన్నారు. పంట రుణాలు రూ.1,672కోట్లు లక్ష్యం కాగా.. రూ.1280 కోట్లు పంపిణీ చేశామన్నారు. 812 మహిళా సంఘాలకు రూ.50కోట్లు, మెప్మా కింద 32 సంఘాలకు రూ.3.11కోట్లు రుణాలు అందిచామన్నారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, డీఆర్‌డీఓ శ్రీధర్, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం సందర్శన

ధర్మారం: ధర్మారం ఎంపీడీవో కార్యాలయాన్ని కుమార్ దీపక్ సందర్శించారు. ఎంపీడీవో భీమ జయశీల, ఎంపీవో రమేశ్, ఏపీవో రవీందర్‌తో సమావేశమయ్యారు. ధర్మారం, నందిమేడారం, కొత్తూరు, పత్తిపాకలో జరిగిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులపై శ్రద్ధ తీసుకుని త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది!

- పరీక్ష సమయంలో మొరాయించిన మైక్రోఫోన్
- మధ్యలోనే నిలిచిపోయిన డేటా ట్రాన్స్‌ఫర్?
- ఇద్దరు లెక్చరర్ల సాయంతో హైటెక్ కాపీయింగ్
- తాజా అరెస్టులతో మరోసారి తెరపైకి వ్యవహారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి కరీంనగర్‌కు ఉన్న లింకులు తవ్విన కొద్దీ వెలుగుచూస్తునే ఉన్నాయి. తాజాగా ఓ ప్రైవేటు కాలేజీలో చదివే ఇద్దరు లెక్చరర్ల అరెస్టుతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఇటీవల హైటెక్ కాపీయింగ్‌కు సంబంధించిన వ్యవహారం వెలుగుచూసిన సమయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కరీంనగర్‌లోని బొమ్మకల్‌కు వచ్చిన సంగతి తెలిసిదే. తాజాగా మరోసారి సిట్ అధికారులు కరీంనగర్‌కు వచ్చారు. జిల్లాలో ఇద్దరు ప్రైవేటు కాలేజీ లెక్చరర్ల పాత్రపై ఆధారాలు లభించడంతో వీరిని కూడా సిట్ అరెస్టు చేసింది. వాస్తవానికి ఈ వ్యవహారంలో వీరిద్దరినీ సాయపడ్డారనే ఆరోపణల పైనే అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

ఏంజరిగింది?

వాస్తవానికి ఇద్దరు ప్రైవేటు కాలేజీ లెక్చరర్లకు డీఈ రమేశ్‌తో ముందే పరిచయం ఉంది. పరీక్షరాసే అభ్యర్థుల నుంచి రూ.75 లక్షలకు రమేశ్ ఒప్పందం చేసుకున్నాడన్న ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే కరీంనగర్ నుంచి కొందరితో రమేశ్ అవగాహన కుదుర్చుకున్నాడు. తాను ఒప్పందం చేసుకున్న వారు పరీక్ష రాసేచోట అతని సన్నిహితులైన లెక్చరర్లు సహకరించేలా ముందే రూ.5 లక్షల చొప్పున చెల్లించాడని ప్రచారం జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వీరిద్దరూ రమేశ్ సూచించిన అభ్యర్థులను సరిగా తనిఖీ చేయకుండా.. హైటెక్ డివైజ్‌లు, శక్తిమంతమైన మైక్రోఫోన్‌లతో లోనికి వెళ్లేలా సహకరించారు. కానీ.. ఆరోజు వీరు సహకరించిన అభ్యర్థులు డివైజ్‌లు మధ్యలోనే మొరాయించాయని, సరిగా డేటా ట్రాన్స్‌ఫర్ కాక వాళ్ల పరీక్ష క్వాలిపై కాలేదని ప్రచారంలో ఉంది. ఇందులో వాస్తవమెంత ? అన్న దానిపై ప్రత్యేక దర్యాప్తు బృందం దృష్టి సారించిందని సమాచారం.

అప్పుడు ఆధారాలు లభించలేదా?

బొమ్మకల్‌లో మాజీ ఎంపీటీసీ కూతురును అరెస్టు చేయడానికి గత జూన్ మొదటివారంలోనే సిట్ అధికారులు యత్నించారు. ఈ క్రమంలోనే మాజీ ఎంపీటీసీ కుటుంబం గ్రామం నుంచి పరారైంది. ఆ సమయంలోనే ఈ ఇద్దరు లెక్చరర్లను సిట్ ఎందుకు విస్మరించింది? అన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లెక్చరర్లు సహకరించిన అభ్యర్థులు ఫెయిల్ కావడంవల్లే వీరిపాత్ర ఆలస్యంగా వెలుగుచూసిందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. సిట్ తొలుత పరీక్షల్లో మంచి మార్కులతో పాస్ అయిన అభ్యర్థులపై దృష్టి సారించిందని. కానీ.. రమేశ్ బ్యాంకు లావాదేవీల ఆధారంగా ఇపుడు వీరిద్దరి పాత్ర వెలుగుచూసిందని ప్రచారం సాగుతోంది.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఎలిగేడు: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాములపల్లిలో రెండో విడత మంజూరైన గొర్రెల యూనిట్లను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలో 477 మంది గొల్లకుర్మలకు గొర్రెల యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. రాములపల్లిలో 12 మందికి గొర్రెలు అందించినట్లు పేర్కొన్నారు. కులవృత్తులను ప్రోత్సహిస్తూ వారు ఆర్థికంగా ఎదిగేలా కృషిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సర్పంచ్ సౌమ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు కొండాల్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్తిరెడ్డి ప్రేమలత, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పశువైద్యాధికారి యూనీస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండేది బీఆర్‌ఎస్

సుల్తానాబాద్: బీఆర్‌ఎస్ చెప్పింది చేస్తుందని, చేసేదే చెబుతుందని ఎమ్మెల్యే దాసరి అన్నారు. మండలకేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు చేయని పనులు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని, దానిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతిఒక్కరికీ మేలు జరుగుతోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. పలువురు పార్టీ నాయకులు ఉన్నారు

రామాలయం శిఖరంపై పిడుగు



ధ్వంసమైన రామాలయ శిఖరం

ధర్మారం: మండలంలోని బుచ్చయ్యపల్లి రామాలయం గుడి శిఖరంపై గురువారం సాయంత్రం పిడుగుపడింది. ఈ ఘటనలో ఆలయ శిఖరం స్వల్పంగా ధ్వంసమైంది. భారీ వర్షంతోపాటు ఒక్కసారి పిడుగు వేయడంతో శిఖరం కిందభాగం రెండు ప్రాంతాల్లో స్వల్పంగా ధ్వంసమైందని సర్పంచు కొమురయ్య అన్నారు.

క్లుప్తంగా

నెమలి అప్పగింత



అటవీ అధికారికి నెమలిని అప్పగిస్తున్న కార్పొరేటర్

కోల్‌సిటీ(రామగుండం): వనంలో ఉండాల్సిన జాతీయ పక్షి నెమలి దారితప్పి జనావాసాల్లోకి వచ్చింది. బుధవారం గోదావరిఖనిలోని తిలక్‌నగర్‌లో ప్రత్యక్షమయ్యింది. సింగరేణి కార్మికులు నివాసం ఉంటున్న క్వార్టర్లలో సంచరిస్తుండగా 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా గుర్తించాడు. కుక్కలు దాడి చేయకుండా నెమలికి రక్షణగా నిలిచి అటవీశాఖ అధికారి ఇర్షద్ భేగ్‌కు అప్పగించాడు. ముస్తాఫాతో పాటు స్థానికులు బండి మురళి, రాపల్లి కార్తీక్, మోజెస్ ఉన్నారు.

అల్లీపూర్‌లో చోరీ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఫింగర్ ప్రింట్ టీం, ఎస్సై విజేందర్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం అల్లీపూర్ గ్రామంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో గురువారం దొంగతనం జరిగింది. ఎస్సై విజేందర్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఈగ మల్లయ్య, భార్య మల్లమ్మ, కొడుకు, కూతురుతో అల్లీపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 4న తన పెద్ద కూతురు కుమార్తె బర్త్‌డే వేడుకలు ఉండగా గోదావరిఖనికి వెళ్లారు. గురువారం మధ్యాహ్నం ఇంటికి రాగా తాళాలు పగలగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు భావించారు. బీరువాలోని వస్తువులను పరిశీలించగా రూ.11లక్షల నగదు, 7 తులాల బంగారం, 25 తులాల వెండిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. కరీంనగర్‌లో ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న నగదును దొంగలు ఎత్తుకెళ్లడంతో బాధితులు కంటతడిపెట్టారు. ఘటన స్థలాన్ని సీఐ జగదీశ్ పరిశీలించారు. అలాగే క్లూస్, ఫింగర్ ప్రింట్ టీం వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పటిక పట్టివేత

గోదావరిఖని(రామగుండం): గుడుంబా తయారీకి వినియోగించే పటికను రామగుండం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యైటింక్లయిన్‌కాలనీ రాజీవ్‌నగర్‌తండాకు చెందిన లావుడ్యా రాజేశ్ ఇంట్లో పటికను నిల్వచేసి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 150 కిలోల పట్టిక పట్టుబడింది. స్వాధీనం చేసుకున్న పటికను సీజ్‌చేసి రాజేశ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు. తనిఖీలో ఎస్సైలు శారద, విజయభాస్కర్, సిబ్బంది ఖదీర్, ప్రసాద్, శ్రావణ్, నరేశ్ పాల్గొన్నారు.

ఐటీ రిటర్న్స్ అవకతవకలపై దృష్టి

- సంస్థవ్యాప్తంగా 8,024 మంది ఉన్నట్లు గుర్తింపు
- రూ.60కోట్లకుపైగా తప్పుడు పేపర్లతో ఐటీ మాఫీ



ఓసీపీ-1లో ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఐటీ అధికారులు

గోదావరిఖని: సింగరేణిలో తప్పుడు ఐటీ రిటర్న్స్‌దాఖలు చేసి సుమారు రూ.60కోట్లకుపైగా మాఫీ చేయించుకున్నట్లు ఇన్‌కంటాక్స్ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. సంస్థ వ్యాప్తంగా 8,024మంది సరైన పత్రాలు చూపించకుండానే ఐటీ వాపస్ తీసుకున్నట్లు పేర్కొంటున్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో పెద్ద సంఖ్యలో తప్పుడు పత్రాలతో ఐటీ తిరిగి తీసుకున్నారు. ఈ మేరకు ఇన్‌కంటాక్స్ అధికారులు వీరికి అభియోగ పత్రాలను త్వరలో పంపించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై సంస్థవ్యాప్తంగా ఉన్న అన్ని గనులపై సమావేశాలు నిర్వహించి ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఈసారైనా సరైన పత్రాలతో రిటర్న్స్

గతంలో తప్పుడు పత్రాలతో ఐటీ రిటర్న్స్ తీసుకున్న విషయం వెలుగులోకి రావడంతో ఐటీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈనెలాఖరు వరకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీపత్రాలు సమర్పించే అవకాశం ఉందని ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. అన్ని గనులపై ఐటీ అధికారులు పర్యటిస్తూ వివరిస్తున్నారు. సరైన పత్రాలు లేకుండా ఐటీ డబ్బులు తిరిగి తీసుకుంటే చర్యలు తప్పవని పేర్కొంటున్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించి..

ప్రధానంగా రాజకీయ పార్టీలకు డొనేషన్లు, ఇంటి రుణానికి సంబంధించిన వడ్డీ, ఎలక్ట్రికల్ వాహనాలు కొనుగోలు, వృద్ధులకు మెడికల్ క్లెయిమ్స్, దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స పేరుతో బిల్లులు సృష్టించి చాలామంది ఇన్‌కంటాక్స్ తిరిగి పొందినట్లు అధికారులు గుర్తించారు. వీరిలో రూ.లక్షకు పైగా ఇన్‌కంటాక్స్ పొందిన వారిపై దృష్టి సారించి త్వరలో వారందరికీ నోటీసులు జారీ చేయనున్నారు.

తప్పుడు ఫైలింగ్ చేయరాదు

కమాన్‌పూర్: సింగరేణి కార్మికులు ఇన్‌కం ట్యాక్స్ తప్పుడు ఫైలింగ్ చేయరాదని ఇన్‌కం ట్యాక్స్ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీగాయత్రి అన్నారు. ఆర్జీ-3 ఏరియాలోని ఏఎల్‌పీ గని వద్ద గురువారం కార్మికులకు ఇన్‌కం ట్యాక్స్, ఫైలింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ రవి, సింగరేణి అధికారులు విజయ్‌కుమార్ సోనీ, రవిచంద్ర, సాయికృష్ణ ఉన్నారు.

దిగబడిన వాహనం.. అధికారుల మధ్య వాగ్వాదం





గోదాం రోడ్డుపై దిగబడ్డ వాహనం, వాగ్వాదానికి దిగిన డీసీఎంఎస్, సివిల్‌సప్లై అధికారులు

- డీలర్లకు చేరని సబ్సిడీ బియ్యం
- అధ్వాన రోడ్లపై అవస్థలు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని బస్టాండ్ పక్కనున్న సివిల్ సప్లై గోదాం, డీసీఎంఎస్ గోదాం ముందు రోడ్డు అధ్వానంగా మారింది. వానాకాలంలో బురదగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా తయారవుతుంది. రేషన్ షాపులకు బియ్యంతో వెళ్తున్న వాహనాలు ఈ రోడ్డుపై గురువారం దిగబడ్డాయి. ఇటీవలి వర్షాలకు నీరునిల్వకుండా డీసీఎంఎస్ అధికారి విజయేందర్‌రెడ్డి కాలువ తవ్వించడంతోనే ఇలా జరిగిందని సివిల్‌సప్లై గోదాం అధికారి తిరుపతి వాగ్వాదానికి దిగారు. ఇరువురి మధ్య వివాదం తారాస్థాయికి చేరడంతో బస్టాండ్ ప్రాంతంలో పెద్దసంఖ్యలో జనం గుమిగూడారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కాలువ తవ్వించానని విజయేందర్‌రెడ్డి తెలపగా.. తమ వాహనాలు రాకుండా చేసేందుకే తవ్వించారని తిరుపతి ఆరోపించారు.

కార్మికులే బలం.. బలగం

- వారి సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం
- ఈనెల 10 లోపు చర్చలు పూర్తి చేయాలి
- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులే కార్మిక సంఘాల బలం.. బలగం అని, వారి సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు యాజమాన్యానికి సూచించారు. గురువారం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద చేపట్టిన నిరసనలో మాట్లాడారు. పాత ఒప్పందంలోని పలు పెండింగ్ అంశాలను విడతలవారీగా అమలు చేసేందుకు యాజమాన్యం కసరత్తు చేస్తోందని అన్నారు. అన్ని విభాగాల కార్మికులను గుర్తించి వారికి పదోన్నతి కల్పించాలన్నారు. ఈనెల 10లోపు పాత ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించని క్రమంలో 11న పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్లు కార్మికులకు తెలిపారు. నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, ఇజ్జగిరి భూమయ్య, రాధారపు రాజమల్లయ్య, సత్యం, శ్రీనివాస్, ఆర్.లక్ష్మణ్, ఎం.శంకర్, నాగభూషణం, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి



సిద్ధార్థ (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం కల్వచర్ల వద్ద మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై గత నెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కారుపాకల సిద్ధార్థ(6) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. లొంకకేసారం గ్రామానికి చెందిన కారుపాల సతీశ్ గత నెల 30న సాయంత్రం తన కొడుకు సిద్ధార్థను వెంటన రీకాలనీకి తీసుకెళ్లి పుస్తకాలు కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఇసుక లారీ ఢీకొట్టడంతో సతీశ్ అక్కడిక్కడే మృతిచెందాడు. సిద్ధార్థకు రెండు కాళ్లు విరగడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. రోజువారీ కూలీ పనులు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్న సతీశ్ కటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి కోరారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న అశోక్

పాలకుర్తి(రామగుండం): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి నిరవధిక సమ్మెను విరమింపజేయాలని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట స్థానిక పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. జీవో నం. 60 ప్రకారం కనీస వేతనం రూ.19వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. కారోబార్లు, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మికులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల నిరవధిక సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, మంకాలి ఆనంద్, బూడిద రామస్వామి, కట్ల స్వామి, కిష్టయ్య, అంజలి, లక్ష్మి, స్వరూప, శేఖర్, పోచారం, మల్లేష్ దీపిక, వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. ఎస్సై బి.జీవన్ వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని గోదావరిభవన్‌లో విధులు నిర్వహిస్తున్న కేరళకు చెందిన దీపక్(21) బుధవారం విధులు ముగించుకుని క్వార్టర్‌కు వెళ్లి కనిపించలేదు. ఆచూకీ దొరక్కపోవడంతో సీనియర్ మేనేజర్ కార్తికేయన్ ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే మేలు



అల్లీపూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండ వర్గాలకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం అల్లీపూర్, నీరుకుల్లలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలను వివరించారు. రూ.500కే గ్యాస్, రెండు లక్షల రుణమాఫీ, ఇల్లు కట్టుకునే వారికి రూ.5లక్షల ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి అమలు చేస్తామన్నారు. నాయకులు ప్రకాశ్‌రావు, అన్నయ్యగౌడ్, సతీష్, దామోదర్‌రావు, అశోక్, రమేశ్, మల్లయ్య, తిరుపతి, రవి తదితరులున్నారు.

నేడు సెక్రెటరీ పదవికి ఎన్నికలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిక వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రెటరీ పదవికి శుక్రవారం ఎన్నికలు జరుగనున్నాయి. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిక క్లబ్ ఆవరణలో జరుగనున్న ఎన్నికలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో రాజనర్సయ్య, వేముల కృష్ణయ్య పోటీలో ఉన్నారు. వైస్ ప్రెసిడెంట్ పదవికి వి.రాములు, జాయింట్ సెక్రెటరీగా ఆర్.సంపత్, కమిటీ సభ్యులుగా కందుల సత్తయ్య, ఆర్.సాంబయ్య, వి.అశోక్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 613 మంది అర్హులుగా ఉన్నారు. గుర్తింపు కార్డును తీసుకుని ఓటింగ్ పాల్గొనాలని, ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, 5 గంటల తర్వాత లెక్కింపు అనంతరం ఫలితాల ప్రకటన ఉంటుందని ముఖ్య ఎన్నికల అధికారి సుధాకర్, ఎన్నికల అధికారులు సమంత, ఎస్ఎస్ సుందరం తెలిపారు.

అమ్మ చూపు సజీవం



లక్ష్మి(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్ కాలనీకి చెందిన కుడిది లక్ష్మి(60) గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ సహకారంతో ఆమె నేత్రాలను దానం చేయడానికి ముందుకొచ్చారు. టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా సేకరించిన ఆమె నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. ఈసందర్భంగా లక్ష్మి కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో లక్ష్మి కుమారుడు ముత్తయ్య, కూతుర్లు రాజేశ్వరి, శంకరమ్మ, శశికళ, లక్ష్మి ఫౌండేషన్ సభ్యులు టి.శ్రావణ్, లింగమూర్తి, వెల్ది కవిత, అనంతరాములు, భీష్మాచారి, నూక రమేష్, వాసు, రాజమౌళి, అన్నపూర్ణ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తానిపర్తి విజయలక్ష్మి, బంక కళావతి, సభ్యులు మనీషా అగర్వాల్, వేణుగోపాల్ త్రివేది ఉన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రేపల్లెవాడ హామ్లెట్ నాగారం గ్రామానికి చెందిన బూస రాజయ్య తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వాడుతుండగా కేసు నమోదైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి వివరాలు.. రాజయ్య తన ఇంటికి అనుమతి లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తుండగా విద్యుత్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. రెండోసారి పట్టుబడగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా సెషన్స్ జడ్జి డి.హేమంత్‌కుమార్ ఎదుట నిందితుడిని ప్రవేశపెట్టగా రూ.29,400 జరిమానా చెల్లించాలని లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు.

సింగరేణి వార్తలు

సింగరేణి సొమ్మును దోపిడీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఏఐటీయూసీ నేత రంగయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రంగయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోపిడీ చేస్తోందని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య ఆరోపించారు. గురువారం జీడీకే-2ఏ, 11 గనులపై ఏర్పాటు చేసిన వేర్వేరు గేట్ మీటింగ్‌లలో ప్రసంగించారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఆరేళ్లు గడిచినా అమలు చేయడంలేదన్నారు. కోలిండియాలో కార్మికులకు అలవెన్స్‌లపై ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని దానిని సింగరేణిలో అమలు చేయించడంలో టీబీజీకేఎస్ వైఫల్యం చెందిందన్నారు. కార్మికులు కష్టపడి బొగ్గు ఉత్పత్తి చేసి సింగరేణికి లాభాలు తీసుకువస్తే వాటిని రాష్ట్ర ప్రభుత్వం వివిధ స్కీంల పేరుతో దోపిడీ చేస్తుందన్నారు. వెంటనే 23 నెలల వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 8న ప్రధాన మంత్రి మోడీ వరంగల్ పర్యటనకు వస్తున్న సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి కార్మికులు నిరసన తెలపాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

రామగుండం రీజియన్‌లో కొనసాగిన సమ్మె



యజమానులతో మాట్లాడుతున్న పోలీసులు

గోదావరిఖని(రామగుండం): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కన్వేయన్స్ వాహనాల యజమానులు గురువారం రామగుండం రీజియన్‌లో సమ్మె నిర్వహించారు. దీంతో ఓసీపీల్లోని క్వారీలోకి వెళ్లేందుకు కార్మికులు ఇబ్బందిపడ్డారు. జీఎం వాహనాలతో పాటు ఇతర వాహనాలను కూడా నడవనీయలేదు. అత్యవసరంగా పనిచేసే అంబులెన్స్‌లు, స్కూల్ బస్సులను సమ్మె నుంచి మినహాయించారు. అయితే తమకు వాహనాల యూనిట్ రేట్ పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా ఓసీపీల్లోని క్వారీల్లోకి కార్మికులను తరలించడం తప్పనిసరి కావడంతో యాజమాన్యం అద్దె ప్రతిపాదికన ప్రైవేట్ వ్యాన్లను ఓసీపీల్లోకి తీసుకవచ్చింది. గనులపై ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆర్జీ-3లో..

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ-3 ఏరియాలో అద్దె వాహనాల యజమానులు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. వాహనాలు నిలిపివేయడంతో అధికారులు కార్యాలయాలకు, గనుల్లోకి వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. తన న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని అద్దె వాహన యాజమానులు తెలిపారు.

సేఫ్టీ మీటింగ్‌కు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో రక్షణపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న నిర్వహించే త్రైపాక్షిక సేఫ్టీ మీటింగ్‌కు ఏర్పాట్లు చేయాలని ఆర్జీ-3 జీఎం కె.సుధాకర్‌రావు అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మీటింగ్‌కు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని సూచించారు. సమావేశంలో అధికారులు ఎలిషా, బైద్య, రఘుపతి, వెంకటరమణ, రాధాకృష్ణ, రాజేందర్, శ్రీనివాస్, నాగరాజు, కాశీవిశ్వేశ్వరరావు, ఉదయ్‌రాజన్, చంద్రశేఖర్, పద్మరాజు, రవీందర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్ చెల్లించడం అభినందనీయం



మాట్లాడుతున్న వెంకన్న

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ-3 ఏరియాలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన ఏరియర్స్ చెల్లించడం అభినందనీయమని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న అన్నారు. ఈసదర్భంగా ఆర్జీ-3 సివిల్ డీజీఎం పద్మరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కాంట్రాక్టు కార్మికులతో కలిసి మాట్లాడారు. ఆర్జీ-3 ఏరియాలో బెల్ట్ క్లీనింగ్, ఆఫీస్‌బాయ్స్, హౌజ్ కీపింగ్ తదితర విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 2021 నుంచి రావాల్సి ఏరియర్స్ ఇప్పించాలని సివిల్ డీజీఎంకు విన్నవించగా వెంటనే స్పందించి చెల్లించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇతర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు కూడా రావాల్సిన ఏరియర్స్ చెల్లించేలా చూడాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరావు అన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం మండలంలోని జీపీ కార్మికులు ఎంపీడీవో ఆఫీసఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు అర్హత ఆధారంగా కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని, మల్టీపర్పస్ విదానం రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక శాఖ జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీపీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు గట్టయ్య, ప్రధాన కార్యదర్శి రాజబాబు, నాయకులు సంపత్, ఎండీ గౌస్‌ద్దీన్, లక్ష్మి, ఓదెమ్మ, మధునయ్య, లక్ష్మణ్, కుమార్, మురళీ, స్వామి, రాజేశ్వరి, సుజాత, రామస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ-2 డివిజన్ పరిధిలోని సివిల్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్జీ-2 డీవైజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.అశోక్, ఎ.వెంకన్న, డి.బుచ్చమ్మ, ఇ.కుమార్, శ్రీను, రాజు, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.